నత్తనడకన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - జి.మాడుగుల:మండలంలోని సింగర్బా పంచాయతీ కేంద్రంలో సుమారు ఎనిమిదిన్నర లక్షల రూపాయలతో తడి పొడి చెత్త కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించి నేటికీ సుమారు మూడు సంవత్సరాలు అవుతున్నా పూర్తి కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

నిలిచిన తడి పొడి చెత్త కేంద్రం

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

యండపల్లివలసలో గిరిజనేతరుల నిర్మాణాలు ▸ గిరిజన చట్టాలకు తూట్లు ▸ చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని పద్మాపురం పంచాయతీ యండపల్లివలస మెయిన్ రోడ్డు పక్కన గిరిజనేతరుల అక్రమ కట్టడాలు రోజురోజుకు పెరుగుతున్నా మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టం, పీసా చట్టం ఇతర గిరిజన చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ గిరిజనేతరులు అక్రమ కట్టడాలు చేపడుతున్నా నిలుపుదల చేయవలసిన అధికారులు వారికి కొమ్ము కొమ్ము కాస్తున్నారు. అనుమతి లేకుండా నివాస గృహాలు, దుకాణాలు, బినామీల పేరిట లాడ్జీలను నిర్మిస్తున్నారు. మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మించుకుంటున్నా రెవిన్యూ, పంచాయతీ అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో గిరిజనేతరులు మరింతగా రెచ్చి పోయి యండపల్లివలస ప్రాంతంలో జోరుగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. యండపల్లివలస ప్రధాన రహదారుల పక్కన కెనరా బ్యాంకు ఏటిఎం దగ్గర నుండి మీ సేవ దగ్గర, రైల్వే క్వార్టర్స్ పక్కన వరకు గిరిజనేతరులు పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై గతంలో పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ధర్నాలు, ఫిర్యాదులు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాయ్స్ హాస్టల్ వెనుకాల సీ కోలనిలో ఇద్దరు గిరిజనేతరులు షాపు, భవనం నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించు కోలేదు. గతంలో మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదు. ఓ గిరిజనుడు చిన్న బడ్డీ పెట్టుకొని వ్యాపారం చేసుకుంటే రెవెన్యూ అధికారులు హుటాహుటిన తొలగిస్తున్నారు. అదే గిరిజనే తరులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకునే పరిస్థితి కనిపించ లేదు. గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ భవనాలు, దుకాణాలు లాడ్జిలపై చర్యలు తీసుకోవాలని గిరిజన, ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చేపడుతున్న షాపు నిర్మాణం

యండపల్లివలస గ్రామంలో అక్రమంగా చేపడుతున్న గృహ నిర్మాణం

రూ.14 లక్షలతో హెచ్‌పిఎల్‌సి మిషన్ ఏర్పాటు

- సికిల్ సెల్, తలసేమియాలకు రక్త పరీక్షలు ఇక ఇక్కడే
- 'ప్రజాశక్తి'తో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.లీలా ప్రసాద్

ప్రజాశక్తి - పాడేరు:అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో సికిల్ సెల్ ఎనిమియా, తల సేమియా రక్త పరీక్షల సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.లీలా ప్రసాద్ వెల్లడించారు. ఈ రక్త పరీక్షల కోసం ఇప్పటివరకు పేషంట్స్‌ను విశాఖపట్నం కెజిహెచ్‌కు రిఫరల్ చేస్తున్నామని చెప్పారు. ఈ రక్త పరీక్షల నిర్ధారణ కోసం హెచ్‌పిఎల్ సి(హై ప్రొఫైల్ లిక్విడ్ కాన్సెంట్రేషన్) మిషన్ రూ.14 లక్షల వ్యయంతో కొనుగోలు చేసామని తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఈ మిషన్ అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. జకనులు తల సేమియా వ్యాధిగ్రస్తులకు రక్త పరీక్షల నిర్ధారణ ద్వారా నిర్ధారణ చేసి చికిత్స అందించేందుకు సౌలభ్యం చేకూరిందన్నారు. జిల్లాలోని వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రవేశపెట్టిన కొత్త కార్యక్రమాలపై ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు..

ఆర్ఓఆర్ ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు

పాడేరు ఏజెన్సీలోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆర్ఓఆర్ ప్లాంట్లను సమకూర్చి రోగులకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం.

హ్యాండ్ వాషింగ్ మిషన్లు పంపిణీ

ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లకు హ్యాండ్ వాషింగ్ మిషన్లు పంపిణీ చేసాం. అలాగే ఈ సెంటర్లలో 133 మంది మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తూ తద్వారా పిహెచ్‌సిలు, జిల్లా ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్యను క్రమబద్ధీకరిస్తున్నాం.

డెడ్ బాడీ ఫ్రీజర్లు ఎన్నిఉన్నాయి

ఏజెన్సీలోని నాలుగు ప్రధాన ఆసుపత్రులకు డెడ్ బాడీ ఫ్రీజర్లు అందుబాటులోకి తెచ్చాం. పాడేరు జిల్లా ఆసుపత్రి, అరకు ఏరియా ఆసుపత్రి, చింతపల్లి, ముంచంగిపుట్టు కమ్యూనిటీ ఆసుపత్రిలో మొత్తం 13 డెడ్ బాడీ ఫ్రీజర్లు అందుబాటులో ఉన్నాయి..

పునరావాస కేంద్రం ఏర్పాటు

పాడేరు జిల్లా ఆసుపత్రిలో చెడు వ్యసనాల బాధితులకు పునరావాస కేంద్రం అందుబాటులోకి తెచ్చి ఆల్కహాల్, పొగాకు వంటి వ్యసన బాధితులతో పాటు మానసిక వ్యాధులు ఉన్నోన వారికి పునరావాస సౌకర్యం కల్పిస్తాం. కౌన్సెలింగ్, ఉచిత వైద్య సేవలు కల్పిస్తున్నాం.

108,104 వాహనాల పరిస్థితి

కొత్తగా పద మూడు 108 అంబులెన్స్‌లు, ఒక నియో నేటల్ కేర్ వాహనాలను అందుబాటులోకి తెచ్చాం. 104 సంచార వైద్య చికిత్సల కోసం 11 వాహనాలను ఏర్పాటు చేసి గిరిజన గ్రామాల్లో రోగులకు వైద్య సేవలు కల్పిస్తున్నాం. కొత్తగా రెండు పిహెచ్‌సిలకు భవనాలు సమకూరాయి. ఇటీవల కొంగడ పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభించాం. కొరుకొండ పిహెచ్‌సి భవన నిర్మాణం పూర్తి కావచ్చింది.

సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు

నూతనోత్తేజంతో పోరాటం

సిఐటియు జిల్లా నాయకులు రామరాజు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రామరాజు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సమస్యల పరిష్కారానికి నూతనోత్తేజంతో పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని భవన నిర్మాణ రంగ కార్మికుల అసోసియేషన్, సిఐటియు రాష్ట్ర నాయకులు రామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక తాపీ మేస్త్రీల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ముందుగా భవన నిర్మాణ కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత మూడేళ్ల చేదు అనుభవాలను విడిచి, కొత్త సంవత్సరంలో నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలన్నారు. కార్మిక చట్టాలు, హక్కులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, సంక్షేమబోర్డు నిధులను మళ్లించి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు,

కార్మికచట్టాల స్థానే అమల్లోకి వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులు పూర్తిగా యాజమాన్యాల గుప్పెట్లోకి వెళ్లిపోయాయన్నారు. దీన్ని శ్రమజీవులుగా ప్రతి ఒక్క కార్మికుడు ఖండించాలని, ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని కార్మికుల గుర్తింపు కార్డులు రెన్యువల్ చేసి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాపీ మేస్త్రిల సంఘం నాయకులు పి శ్రీను, ఎన్ రామకృష్ణ, ఎన్ అచ్చారావ్, ఎస్ నాగు, ఎస్ వీరబాబు, అప్పన్నబాబు, సత్తిబాబు, శ్రీను, వర్మ పాల్గొన్నారు.

పెంచిన పింఛన్లు పంపిణీ

విఆర్.పురంలో పింఛను పంపిణీ చేస్తున్న పెంచిన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని తామరపల్లి, ముసురిమిల్లి సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు పెంచిన మొత్తాలతో పింఛన్లను ఎంపిటిసి వంశీ కుంజం ఆదివారం పంపిణీ చేశారు. అందరికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. పింఛను లబ్ధిదారులతోపాటు ప్రజలతో మాట్లాడి, ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో తామరపల్లి సర్పంచ్ మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, ముసురిమిల్లి సర్పంచ్ కోసు రమేష్‌బాబు, వార్డు సభ్యులు సత్యనారాయణ, ప్రభవాతి, వైసిపి నేతలు కుంజం అబ్బులు, నాగమణి, పంచాయతీ కార్యదర్శి నాగమణి, సచివాలయం సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు

నూతన పింఛన్లు పంపిణీ చేసిన ప్రజా ప్రతినిధులు

విఆర్ పురం : మండలంలోని పెరిగిన పింఛన్లును రేఖపల్లి గ్రామ పంచాయతీ సచివాలయంలో సర్పంచ్ పూనం సరోజినీ, ఎంపిపి కారం లక్ష్మి ఎంపిటిసి బంధం విజయలక్ష్మి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి మాట్లాడుతూ, పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, పంకు శ్రీరామమూర్తి, పంకు సత్తిబాబు, హజ్రత్,వైసిపి నేతలు చిక్కాల బాలు మడకం కన్నారావు సోలా యేసు సచివాలయ సిబ్బంది బుచ్చిరాజు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో రామాలయం వీధిలో సచివాలయ కన్వీనర్లు చేతుల మీదుగా ఆదివారం నూతనంగా పెరిగిన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ రాంబాబు మాట్లాడుతూ, ఇక నుంచి పింఛను రూ.2750లు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు ఎం.విజయ కుమారి, బాబురావు, మూరి, దొర, పురుషోత్తం, రాజు, గోపాలరాజు పాల్గొన్నారు,

వేతన బకాయి చెల్లించరూ..

ఆవేదన చెందుతున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పంచాయతీలో పారిశుధ్య పనులకు టెండర్ దక్కించుకున్న చంద్రయ్య అనే కాంట్రాక్టర్ గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి పంచాయతీ పరిధిలో ఐదుగురు కాంట్రాక్టు కార్మికులతో పనిచేయించాడన్నాడు. పంచాయతీ పరిధిలో స్థానిక మార్కెట్,అల్లూరి వీధి, దుర్గా వీధి, తదితర ప్రాంతాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టిన తమకు గడచిన మూడు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలను చెల్లించడం లేదని,ఈగల సింహాచలం అనే పారిశుధ్య కార్మికుడు ప్రజాశక్తి వద్ద తన ఆవేదన వ్యక్తం చేశాడు. అసలే అరకొర వేతనాలు, వాటిని సకాలంలో సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ అగమ్యగోచరంగా మారుతోందని వాపోయాడు. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని, నూతన సంవత్సరాదిన చేతిలో చిల్లిగవ్వ లేని స్థితిలో అల్లాడుతున్నామని అంటున్నాడు. ఇప్పటకైనా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ చొరవ తీసుకుని తమకు వేతన బకాయి చెల్లింపునకు చర్యలు చేపట్టాలని, లేకుంటే మూకుమ్మడి పనులు నిలుపుదల చేస్తామని హెచ్చరిస్తున్నారు.

గంజాయితో ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి -కొయ్యూరు : గంజాయి అక్రమ రవాణాపై ముందస్తుగా అందిన సమాచారం మేరకు కొయ్యురు సిఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో, కొయ్యూరు, మంప ఎస్ఐ, సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలో, చీడిపాలెం గ్రామశివారులో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా, చింతపల్లి మార్గంలో మీదుగా ఏలేశ్వరం వైపు రెండు బైక్‌లపై వస్తున్న ఆరుగురిని గుర్తించారు. పోలీసులను చూసి బైక్‌లను వెనక్కు తిప్పి పరారయ్యేందుకు యత్నించిన వారిని మంప ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు తనిఖీ చేయగా రెండు లగేజీ బ్యాగుల్లో ఉన్న 32కిలోల గంజాయి పట్టుబడింది. బైక్‌తోపాటు యాక్టివ స్కూటీతోపాటు ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తూర్పుగోదావరి జిల్లకు కుందూరుకు చెందిన సుంకర సూర్య ప్రకాష్, రాజవొమ్మంగికి చెందిన మాధవరపు సురేష్ బాబు,చింతపల్లికి చెందిన. గొర్లె శాంతికుమార్..పాంగి సురేష్, కొర్ర ఆనంద్, వంతల రామకృష్ణలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ స్వామినాయుడు తెలిపారు.

క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నర్సింగరావు

ప్రజల పత్రిక 'ప్రజాశక్తి'

- ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రజల పక్షాన పోరాడే పత్రిక ప్రజాశక్తి అని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కొనియాడారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు తలారి సింగిలోని తన నివాసంలో ఆదివారం ప్రజాశక్తి క్యాలెండర్-2023ను ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నర్సింగరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాశక్తి పత్రిక కృషిని అభినందించారు. ప్రజా సమస్యలపై మంచి కథనాలను ప్రచురం చేస్తూ ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ప్రజలకు మధ్య వారధిలా ప్రజాశక్తి పని చేస్తోందన్నారు. క్యాలెండర్‌ను ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని, ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట, పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ కె.సింహాచలం నాయుడు, సిహెచ్.రమాదేవి, ప్రజాశక్తి డిఒ పి.దేముడుబాబు, విలేకరి ఒ.జ్ఞానప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన

రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు:ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ ముందు నిర్వహిస్తున్నరిలే నిరాహార దీక్షలు ఆదివారం 14వ రోజు న్యూ ఇయర్ నాడు కూడా కొనసాగాయి. ఈ దీక్షలను ఉద్దేశించి ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, ఐక్య వేదిక కో కన్వీనర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందిం చేంత వరకు ఉద్యమం ఆపేది లేదని, వెంటనే జోక్యం చేసుకొని, గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు తక్షణమే హెల్త్ అసిస్టెంట్‌లను ఆశ్రమాల్లో నియమించాలని, గిరిజన ఆశ్రమ విద్యార్థులు మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులు రెండు నెలల కాలంలోనే ఆరుగురు విద్యార్థులు మరణించినా అధికారులకు, ప్రభుత్వానికి చలనం లేదన్నారు. పాడేరు ఐటీడీఏ పిఓను తక్షణమే సరెండర్ చేయాలని, పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. పాడేరు ఐటీడీఏ పీవోను రక్షించడం కోసం అమాయక ఉద్యోగులను బలి చేయడం సరికాదని, వారి సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని కోరారు. ప్రజా సంఘాల ప్రతినిధులను గిరిజన విద్యాసంస్థల్లోకి ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్కులర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక కోకన్వీనర్లు ముచ్చాళ లక్ష్మణరావు, చిన్నారావు, కాదేలి చంటిబాబు, బత్తిరి నరేష్, పి.లోకేష్ పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న నాయకులు

పింఛన్ల తొలగింపు దారుణం

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : లేనిపోని కారణాలను సాకుగా చూపి కొన్నేళ్లుగా వేర్వేరు ప్రభుత్వాల హయాంలోనూ పొందుతున్న వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లును తొలగించడం దారుణమనిలోదొడ్డి సర్పంచ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు విమర్శించారు. కొత్త సంవత్సరంలో లబ్ధిదారులకు ఇచ్చిన కానుక ఇదేనా అని ప్రశ్నించారు. ఆదివారం లోదొడ్డి పంచాయతీలోని పింఛన్లు కోల్పోయిన లబ్ధిదారులతో మాట్లాడారు. ఏ కారణంతో అనర్హులుగా తేల్చారో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, లోదొడ్డి పంచాయతీ మాతే బంగారమ్మ అనే వద్ధ మహిళకు భర్త బతికున్నాడన్న కారణంతో ఆరు నెలలుగా పింఛను నిలిపేశారనానరు. బంగారమ్మ భర్త చనిపోయి ఎనిమిదేళ్లవుతుండగా, ఇపుడు రికార్డుల్లో బతికున్నట్లు పేర్కొని, పింఛను తొలగించి, నిరుపేద వితంతు మహిళలకు ఆసరా లేకుండా చేశారని మండిపడ్డారు. పంచాయతీ పరిధిలో ఇలాగే ఐదుగురు అర్హులైన లబ్ధిదారులకు లేనిపోని కారణాలను చూపి అన్యాయంగా తొలగించేశారన్నారు. జనవరి నుంచి ప్రభుత్వం కొత్తగా పెంచిన రూ.250లతో కలిసి కొత్త సంవత్సరం, సంక్రాంతికి పింఛను డబ్బులు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఆవేదన గురిచేయడం ఎంతవరకు సమంజసం కాదని ప్రశ్నించారు. తక్షణం ప్రభుత్వం స్పందించి, ఏ ఒక్కరి పింఛను రద్దు చేయకుండా అర్హులందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. కుంటిసాకులతో పింఛన్లు తొలగిస్తే లబ్ధిదారులను సమీకరించి, ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పింఛను రద్దు నోటీసు అందుకున్న లబ్ధిదారుతో మాట్లాడుతున్న రామారావు

వైసిపి అరాచక పాలనకు చరమగీతం

టిడిపి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి



కండువా కప్పి టిడపిలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

ప్రజాశక్తి- రంపచోడవరం : మూడున్నరేళ్లలోనే రాష్ట్రాన్ని అథోగతి పాల్జేసిన సిఎం జగన్మోహనరెడ్డి నేతృత్వంలోని వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పిలుపునిచ్చారు. ఆదివారం మండల టిడిపి అధ్యక్షుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో 15కుటుంబాల వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి మాట్లాడుతూ, మూడున్నరేళ్లలో ఏజెన్సీలోని ఒక్క రోడ్డైనా వేయలేదని, తాగునీరు ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు కనీస చర్యలు చేపట్టలేదన్నారు. పోనీ పంచాయతీ నిధులతో గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిద్దామంటే వాటిని జగన్ సర్కార్ లాగేసుకుందన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు ఇలా ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ పేదలకు కంటకన్నీళ్లు పెట్టిస్తున్నారన్నారు. మొదటిఏడాది ఇచ్చిన రైతుభరోసా, జగనన్న ఇళ్లు, అమ్మఒడి, విద్యా, వసతిదీవెన,ఇలా అనేక సంక్షేమ పథకాలను ఏయేటికాయేడు కోత పెట్టేస్తూ లబ్ధిదారులను కుదించి, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేశారని మండిపడ్డారు. ఏజెన్సీ పురోభివృద్ధి చెందాలన్నా, సమస్యలు పరిష్కారమై ప్రజలు సుభిక్షంగాఉండాలన్న సమర్ధవంతుడైన చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. పసుపు జెండా నీడలోనే రాష్ట్రం దశ, దిశ పురోగమిస్తుందన్నారు. మూడున్నరేళ్లు సహనం, ఒపిక పట్టిన ప్రజలంతా మరో ఏడాదిన్నర ఆగితే చంద్రన్న రాజ్యం వస్తుందని, ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నూతన సంవత్సర కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలుగుదేశం శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నాయి.

ఎర్రగొండమ్మను దర్శించుకున్న ఎంపీ దంపతులు

ప్రజాశక్తి -కొయ్యూరు : . కొయ్యూరు మండలం శరభన్నపాలెం. నడింపాలెం గ్రామాల మధ్య కొలువైయున్న ఎర్రగొండమ్మ తల్లిని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి శివప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు, ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్రెడ్డిపై, రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరుకున్నానన్నారు. ఈ సందర్భంగా అక్కడున్న ఆలయ సమస్యలు తీర్చాలంటూ ఎంపీకి ఆలయ కమిటీ ప్రతినిధులు, సర్పంచ్ వినతిపత్రం అందజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కలెక్టర్, పిఒ, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్‌కు పలువురు శుభాకాంక్షలు

పాడేరులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: నూతన సంవత్సర వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2023 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అన్ని వర్గాల ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో ప్రముఖుల నివాసాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల కార్యాలయాల్లో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తలారి సింగిలోని తన నివాసంలో పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తల, అభిమానుల శుభాకాంక్షలు అందుకున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని పలువురు అధికారులు, ఆయా శాఖల విభాగాల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఐటిడిఎ పిఒ బంగ్లాలో పిఒ రోణంకి గోపాలక్రిష్ణకు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా కార్యాలయాల సిబ్బంది తరలి రావడంతో సందడి నెలకొంది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ వి.అభిషేక్‌ను, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబును కలిసి పలువురు అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, శుభాకాంక్షలు తెలిపారు.

డుంబ్రిగూడ: న్యూ ఇయర్ వేడుకలను మండలంలో గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని క్రైస్తవ చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక అల్లూరి యూత్ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేసి యువత ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో చిన్నారులతో డాన్స్ కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఐటిడిఏలో...

రంపచోడవరం :నూతన సంవత్సరములో ఏజెన్సీవాసులంతాూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, మన్యం అభివృద్ధికి ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని రంపచోడవరం ఐటిడిఏ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. ఆదివారం స్థానిక ఐటిడిఏ ప్రాంగణంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేశారు.వివిధ శాఖలకు అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోవిడ్ నాలుగో వేవ్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలంతా మునుపటిలా మాస్కుల ధారణ,శానిటైజేషన్, ఇతర కోవిడ్ నిబంధనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఇపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, ఐటిడిఏ పరిపాలనాధికారి డిఎస్‌వి. రమణ, ఇఇ జి. డేవిడ్‌రాజ్, పిహెచ్‌ఒ కె.చిట్టిబాబు, ఒ.రాంబాబు, జిసిసి డివిజనల్ మేనేజర్. పార్వతీశ్వరరావు, వెలుగు ఎపిడిలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, రెవెన్యూ మండల పరిషత్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సబ్ కలెక్టరేట్‌లో..

కొత్త సంవత్సరంలోమంచి వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, సమృద్ధిగా దిగుబడులతో ప్రజలంతా . సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. సబ్ కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి పుష్పగుచ్ఛాలిచ్చి, శుభాకాంక్షలు తెలిపారు. కేకు కట్ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఎం సావిత్రి, డేవిడ్‌రాజ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, ఎపిడి వెలుగు, శ్రీనివాసరావు, తహశీల్దార్లు సుబ్రమణ్యం, శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు. సుధాకర్ బాబు, డిటి తాతారావు, సత్యనారాయణ, రవీంద్రబాబు. జిసిసి డిఎం పార్వతీశ్వరరావు పాల్గొన్నారు. నూతన సంవత్సర వేడుకల ఏర్పాట్లు స్థానిక తహశీల్దార్ పొదిలి వెంకటేశ్వరరావు చేశారు.

నూతన సంవత్సర వేడుకల్లో కాంగ్రెస్ నేతలు

సీలేరు: స్థానిక యుసిఐఎం, పెంతుకోస్తు, గ్యాస్తమనే, కల్వరి తదితర క్రైస్తవ ప్రార్ధన మందిరాల్లో జీకే వీధి మండల కాంగ్రెస్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కేకులు పంపిణీ చేశారు. ఏటా మాదిరిగానే ఆనవాయితీగా కేకులు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కారే. శ్రీనివాస్, కార్యకర్తలు ఎం. సత్తిబాబు, వి .అప్పారావు, సిహెచ్. శ్యామ్‌సన్, బంగారయ్య, వి. రాము, నాని, అప్పలరాజు పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు, దారకొండ దుప్పిలివాడ పంచాయతీల ప్రజలు శనివారం అర్ధరాత్రి తర్వాత నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ఇళ్లముందు రంగురంగుల రంగవల్లులతో పాత సంవత్సరానికి గుడ్‌బై చెపుతూ 2023ను స్వాగతించారు. కాగా వేడుకల ఆర్భాటంపై సనాతన తెలుగువారు, పలువురు హిందుత్వవాదులు పెదవి విరుస్తున్నారు.

వేడుకల్లో సిపిఎం నేతలు

విఆర్ పురం: వి ఆర్ పురం సంత మార్కెట్ ప్రాంగణంలోని సాలో ప్రేయర్ హౌస్ క్రైస్తవ చర్చిలో డేవిడ్ లివింగ్స్టన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల్లో ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ సరోజిని, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, సిపిఎం మండల కమిటీ నేతలు పాల్గొని కేక్ కట్ చేశారు విఆర్ పురం బిసి కాలనీ, రేఖపల్లి పెద్దమట్టపల్లి, తదితర చర్చిలలో నూతన సంవత్సర వేడుకల్లో సిపిఎం నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యధర్శి సోయం చిన్న బాబు పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, చిన్న మట్టపల్లి ఎంపిటిసి ప్రదీప్‌కుమార్, నాయకులు పంకు సత్తిబాబు, గుండిపూడి లక్ష్మణరావు, తుర్రం బాబురావు, పోడియం శ్రీరామ్మూర్తి, కమ్మిచిచ్చు సత్యనారాయణ, హజ్రత్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

విఆర్.పురంలో జరిగిన వేడుకల్లో ఎంపిపి లక్ష్మి, తదితరులు

మారుమూల మన్యంలో..

విఆర్‌పురం మండలం వడ్డెరగూడెంలో వేడుకల్లో పాల్గొన్న ఎస్‌పి సతీష్‌కుఆమర్, ఎఎస్‌పి మహేశ్వరరెడ్డి

విఆర్.పురం : జిల్లా, ఐటిడిఎ కేంద్రాల్లో నేతలు, అధికారులు మధ్య ఆర్భాటంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాల్సిన ఇద్దరు జిల్లా స్థాయి అధికారులు ఎస్‌పి సతీష్‌కుమార్, ఎఎస్‌పి మహేశ్వరరెడ్డి మారుమూల ఏజెన్సీలోని విఆర్.పురం మండలం వడ్డెరగూడెం గిరిజన చిన్నారుల మధ్య సందడిగా వేడుక జరుపుకున్నారు. గిరిజన చిన్నారులతో కేక్ కట్ చేయించి, వారికి పంచిపెట్టారు. చాకెట్లు అందజేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి సతీష్‌కుమార్ మాట్లాడుతూ, వరదల సమయంలో గ్రామాన్ని సందర్శించానని, ముంపుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయానన్నారు. ఇటువంటి గ్రామంలో కొత్త సంవత్సర వేడుకలు జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కొత్త సంవత్సరంలో తమ గ్రామానికి వచ్చిన ఇద్దరు ఐపిఎస్ అధికారులకు వడ్డెరగూడెంలోని యువకులు, గ్రామస్తులతోపాటు చిన్నారులు సాదరంగా స్వాగతించారు చిరుసత్కారాలతో అతిథి మర్యాద చేశారు. జిల్లా అధికారుల మధ్య నూతన సంవత్సర వేడుకను జరుపుకోవడంపై ఉబ్బితబ్బిబైపోయారు. తమ సమస్యలను విన్నవించి పరిష్కరించంచాలని వేడుకున్నారు.కార్యక్రమంలో కామేశ్వరరావు, కడుపు రాజు, బొడ్డు సత్యనారాయణ , చిక్కాల బాలు స్థానిక ఎస్‌ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరంలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యాన...

రంపచోడవరంలో కేక్ కట్ చేస్తున్న పిఒ

వ్యూపాయింట్ వద్ద సందడి చేస్తున్న సందర్శకులు

వ్యూ పాయింట్‌కు పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి- చింతూరు : నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని మండలంలోని మారేడుమిల్లి ఘాట్ రోడ్డులోని వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. జలపాతాలు, పచ్చని అడవుల అందాలను కుటుంబాలతో వచ్చి తిలకించి, రోజంతా ఆనందంగా గడిపారు. ఫొటోలు తీయడానికే తప్ప మాట్లాడేందుకు సెల్‌సిగ్నల్స్ లేని ప్రాంతమైన మన్యానికి చేరుకున్న వారంతా మనసు విప్పి మాట్లాడుకోవడం, కేరింతలు తుళ్లింతలో సందడి చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది.

జెడ్‌పిలో 11 మందికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కరోనా సమయంలో ఉద్యోగాల్లో ఉంటూ కరోనా బారినపడి మరణించిన వారి కుటుంబ సభ్యులు 11 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తూ ఆదివారం జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియామక పత్రాలు పొందిన వారంతా తక్షణం విధుల్లో చేరాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, పనిచేస్తున్న సంస్థకు మంచి పేరు తేవాలని కోరారు. కరోనా కష్టకాలంలో తల్లిదండ్రులను కోల్పోయిన వారికి త్వరితగతిన ఆసరా కల్పించాలని ప్రభుత్వం భావించి నియామక చర్యలు చేపట్టిందన్నారు. నియామకాలు పొందిన వారిలో ఒకరు టైపిస్టుకాగా, మిగిలిన పది మంది ఆఫీసు సబార్డినేట్లుగా ఉన్నారు.

బివిఎఫ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పేద బాలలకు బాల వికాస ఫౌండేషన్ (బివిఎఫ్) అందిస్తున్న సేవలు అభినందనీయమని పారిశ్రామికవేత్త భరణికాన రామారావు అన్నారు. ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్డులోగల బాల వికాస ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్‌లో ఆదివారం నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్‌కు అన్ని విధాలా తన సహకారం ఉంటుందన్నారు. స్కూల్‌కు పది ప్లాస్టిక్ చైర్లను అందజేశారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ జివిఎంసి కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, గోడి నరసింహాచారి సహకారంతో పేద బాలలకు బడి, మత్స్యకార మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, శివకుమార్ దీప్తి, రమణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

63వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎనిమిది గ్రామాలకు చెందిన నేవీ నిర్వాసితులు వాడనర్సాపురం సమీపంలో ఎన్ఎఒబి గేటు ముందు చేస్తున్న ఆందోళన ఆదివారానికి 63వ రోజుకు చేరుకుంది. గతంలో అధికారులు ఇచ్చిన హామీలను, తమతో చేసుకున్న ఒప్పందాలను అమలుచేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. రెండు నెలల నుంచి తామంతా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమపై ఎటువంటి దయా కలగలేదన్నారు. ప్రభుత్వాల, అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ త్వరలో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్టు తెలిపారు.

కూరగాయల పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బూరాడ సత్యనారాయణ పాత్రుడు జ్ఞాపకార్థం పేదలకు కూరగాయల పంపిణీ చేశారు. దక్షిణ నియోజకవర్గంలోని 39వ వార్డు కోటవీధిలో ఆదివారం ట్రస్టు చైర్మన్ పిళ్లా వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బూరాడ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అవకాశమిస్తే అన్ని రంగాల్లో మహిళలు రాణింపు

ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అవకాశాలు ఇస్తే మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తారని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం గ్రీటింగ్ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా లోకానికి ఐద్వా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తోందన్నారు. గ్రీటింగ్ కార్డుపై 'ఆధునిక స్త్రీ చరిత్రను పునర్లిఖిస్తుంది - గురజాడ, ప్రతి వంట గత్తె ఒక రాజకీయ వేత్త కావాలి - లెనిన్, చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే చట్టం చెయ్యాలి' అని ముద్రించినట్టు తెలిపారు. సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 150 సంవత్సరాల క్రితం చెప్పినట్లుగా మహిళలు అవకాశాలిస్తే అన్ని రంగాల్లో దూసుకు పోతారన్నారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు రాజకీయాల్లోకి రావాలని లెనిన్ కూడా 150 సంవత్సరాల క్రితమే పేర్కొన్నారన్నారు. ఆ రకంగా రాజకీయాల్లోకి కూడా మహిళలు వచ్చారని, చాలా సమర్థవంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి విజయాలు సాధించిన చరిత్ర మహిళా లోకానికి ఉందన్నారు. కానీ మనువాదులు మహిళలను వంటింటికి పరిమితం చెయ్యాలని, పిల్లలను కనే యంత్రంలా మార్చాలనే తిరోగమన భావజాలం తీసుకువస్తున్నారన్నారు. అందుకే ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ గోడలకు వేలాడుతూనే ఉందని ఆవేదన వెలిబుచ్చారు. పురుషాధిక్యత అడుగడుగునా ఆటంకపరుస్తుందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వెంటనే బిల్లును ఆమోదించి చట్టం చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, స్టీల్‌జోన్ కార్యదర్శి కె.వేణు, నాయకులు డి.వాణి, సుభాషిణి పాల్గొన్నారు.

ఐద్వా నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డును ఆవిష్కరిస్తున్న పుణ్యవతి

శ్రీ వాత్సవ్ రాజకీయ భవిష్యత్తు ఎలా ?

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎంతో పట్టు ఉన్న ద్రోణంరాజు కుటుంబీకుల మూడో తరం నాయకుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ రాజకీయ భవిష్యత్తుపై నేడు చర్చ సాగుతోంది. దీనికి కారణం ఇటీవల శ్రీవాత్సవ్ తన తల్లి, భార్యలతో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలవడం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉండే తను రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆ ఉద్యోగానికి రాజీనామా చేశానని, తన తండ్రి కీర్తిశేషులు ద్రోణంరాజు శ్రీనివాసరావు వారసునిగా తనకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్‌ను శ్రీవాత్సవ్ కోరినట్లు వార్తలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ ఉచ్చ దశలో ఉన్నప్పుడు ద్రోణంరాజు సత్యనారాయణ ఉత్తరాంధ్రలో ఆ పార్టీకి పెద్దదిక్కుగా ఉండేవారు. రాజ్యసభ సభ్యునిగా, పార్లమెంట్ సభ్యునిగా, ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పలు పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. ఉత్తరాంధ్రలో అనేక మందిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి, వారిని నాయకులుగా తీర్చిదిద్దిన గుర్తింపు ఉంది. ఆయన మృతి తరువాత 2006లో విశాఖ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాసరావు పోటీ చేసి గెలుపొందారు. అదే నియోజకవర్గం నుంచి 2009లో కూడా ఆయన గెలుపొందారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన 2019 ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి జగన్ పిలుపుమేరకు వైసిపిలో చేరారు. అదే ఏడాది విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేసి కేవలం మూడు వేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఆయనప్పటికీ శ్రీనివాస్‌ను గుర్తించి విఎంఆర్‌డిఎ చైర్మన్‌గా నామినేటెడ్ పదవి ఇచ్చి జగన్ గౌరవించారు. అయితే అనూహ్యంగా 2020లో కరోనాతో ఆయన మరణించారు. దీంతో అతని కుమారుడు శ్రీవాత్సవ్ తండ్రి వారసునిగా రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించుకొని, తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇది జరిగి దాదాపు రెండేళ్లు కావొస్తున్నా శ్రీవాత్సవ్‌కు వైసిపిలో తగిన గుర్తింపు లభించలేదు. అనూహ్యంగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న వాసుపల్లి గణేష్ కుమార్ టిడిపిని వీడి వైసిపిలో చేరారు. గణేష్ కుమార్ వైసిపిని ఆశ్రయించడంతో ఈ నియోజకవర్గ నుంచి శాసనసభకు పోటీ చేయాలని భావించిన శ్రీవాత్సవ్ ఆశలకు గండి పడినట్లు అయింది. అయినప్పటికీ శ్రీవాత్సవ్ వైసిపిలోనే కొనసాగుతూ ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. ఎమ్మెల్యేగా కాకపోయినా కనీసం శాసనమండలి సభ్యునిగానైనా అవకాశం వస్తుందని ఆయన భావించారు. అదీ కాకపోతే గుర్తింపు కలిగిన నామినేటెడ్ పదవి దక్కుతుందని ఆశడ్డారు. ఇంతవరకూ ఏ పదవీ ఆయనకు దక్కలేదు. ద్రోణంరాజు శ్రీనివాసరావు చనిపోయిన తర్వాత జరిగిన సంతాప సభలో రాజ్యసభ సభ్యుడు, వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి వి.విజయ్ సాయిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ శ్రీనివాసరావు వారసునిగా శ్రీవాత్సవ్‌కు తగిన గుర్తింపు ఇచ్చే పదవిని ఇవ్వటం జరుగుతుందని ప్రకటించారు. అది నేటి వరకూ నెరవేరలేదు. ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చిన మేరకైనా శ్రీవాత్సవ్‌కు ఏదైనా పదవి లభిస్తుందని అతని అనుచరులు భావిస్తున్నారు.


ఇటీవల సిఎంను కలిసిన శ్రీవాత్సవ్ కుటుంబీకులు

సీలేరు రహదారిలో దట్టంగా కురుస్తున్న మంచు

కనువిందుగా.. పొగమంచు అందాలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో చలి తీవ్రత తగ్గినా, మంచు తీవ్రత అధికమైంది. ఆదివారం తెల్లవారి ఐదు గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సీలేరు సరిహద్దుల్లో ప్రాంతాల్లో దట్టంగా కురిసిన పొగమంచుతో రహదారులు కనిపించలేని పరిస్థితి నెలకొంది. దీంతో సీలేరు నుంచి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గుంటవాడ వరకు వాకింగ్ చేసే యువకులు ఇబ్బందులు గురయ్యారు. సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పరిసర ప్రాంతాల్లో మంచు తీవ్రత అధికంగా ఉంది. మూడు రోజుల క్రితం వరకు శీతల గాలులతో వణికించిన చలి, క్రమేణా తగ్గుముఖం పట్టింది. భిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దట్టంగా కురుస్తున్న పొగమంచులో సీలేరు డ్యామ్ అందాలను చూస్తూ ఉదయం వాకింగ్‌కు వచ్చేవారితోపాటు సందర్శకులు మైమరిచిపోతున్నారు.

3,10 తేదీల్లో తారుమారు సంత

ప్రజాశక్తి-జి.మాడుగుల: ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా జరిగే తారుమారు వారపు సంత ఈ నెల 3న, 10న జి.మాడుగుల గ్రామంలో కీర్తిశేషులు మత్స్యరాస వెంకటరాజు ఘాటు వద్ద పొలాల్లో నిర్వహిస్తామని గ్రామ పెద్దలు ఎం.వరహాలురాజు, ఎం.రామరాజు, ఎం.నాగరాజు, చినబాబు తెలిపారు. ఈ విషయాన్ని వ్యాపారస్తులు, ప్రజలు గమనించాలని తెలిపారు.

రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నూతన సంవత్సరంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 2023 నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం తనను కలిసిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో అన్ని శాఖల ఉద్యోగులు, ప్రజలు సహకారం అందిస్తున్నారని, ఇదే సహకారాన్ని కొనసాగించాలని కోరారు. నూతన సంవత్సరం వేళ జిల్లా ప్రజలందరికీ సంతోషాలను, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ ఉన్నారు.

విరాళాల వెల్లువ

నిరుపేదలు, నిరాశ్రయల కోసం ఏర్పాటు చేసిన సంజీవని నిధి, డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు ఆదివారం విరాళాలు వెల్లువెత్తాయి. డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు జిల్లా కలెక్టర్ మల్లికార్జున తన ఒక నెల జీతం రూ.లక్షా 10 వేలును చెక్కు రూపంలో విరాళంగా అందించారు. కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ఉద్యోగులు రూ.12,500ను డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చారు. రెవెన్యూ, విఎంఆర్‌డిఎ తదితర 29 శాఖలకు చెందిన ఉద్యోగులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి చెక్కుల రూపంలో రూ.9 లక్షలా 82 వేలా 998ను విరాళాలుగా అందించారు. నూతన సంవత్సరం రోజునే రూ.10 లక్షలా 92 వేలా 998 డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు అందాయి.

సింహాచలంకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఐటియు ఆధ్వర్యంలో డైమండ్ పార్క్ దగ్గర మొట్ట కళాసీ కొల్లి సింహాచలాన్ని ఆదివారం సన్మానించారు. ముఠా వర్కర్ల హక్కుల కోసం 32 సంవత్సరాలుగా ఆయన ఉద్యమించారని, అనేక సమస్యలపై పోరాడి విజయం సాధించారని, యూనియన్‌ను బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేశారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు పాల్గొన్నారు.